దుర్గంధపు ఘాటు

- గోష్పాద క్షేత్రంలో అధ్వానంగా పారిశుధ్యం
- స్నానఘట్టాల్లో మెట్లపై చెత్తాచెదారం
- పేరుకుపోతున్న పూజా వ్యర్థాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


కొవ్వూరులో అధ్వానంగా ఉన్న గోష్పాద క్షేత్రంలోని స్నానఘట్టం

కొవ్వూరు: పవిత్ర గోష్పాద క్షేత్రంలో పారిశుధ్యం పడకేసింది. నిత్యం వందలాది మంది భక్తులు స్నానాలు ఆచరించే స్నానఘట్టాల వద్ద అపరిశుభ్రత తాండవిస్తోంది. స్నానఘట్టాలు శుభ్రం చేయకపోవడంతో మెట్లపై ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. పూజా వ్యర్థాలు సాన్నఘట్టం మెట్లపైనే పేరుకుపోతున్నాయి. మెట్లపై చెత్తాచెదారం పేరుకుపోవడంతో భక్తులు ఇబ్బందులను చవిచూస్తున్నారు. పిండ ప్రదాన రేవులపై ఇసుక మేటలు వేయడంతో పాటు, పిండ ప్రదానం చేసిన కుండలు, ఇతర వ్యర్థాలన్నీ మెట్లపైనే దర్శనమిస్తున్నాయి. దీంతో స్నానఘట్టాలు దుర్గంధభరితంగా మారాయి.

అంత్యక్రియలు ఇక్కడే..

గోష్పాద క్షేత్రంలో పవిత్రతను దృష్టిలో ఉంచుకుని పరిసర ప్రాంతాల్లో సుమారు వంద కిలోమీటర్ల దూరం నుంచి భక్తులు ఇక్కడికి విచ్చేస్తుంటారు. క్షేత్రంలోని ఆలయాలకు నిత్యం వచ్చే భక్తులతో పాటు, పరిసర మండలాల్లో ఎవరు మృతి చెందినా.. కొవ్వూరులోని హిందూ శ్మశన వాటికకు తీసుకొస్తున్నారు. అంత్యక్రియల అనంతరం ఈ క్షేత్రంలోనే స్నానాలు ఆచరిస్తున్నారు. గురువారం కొయ్యలగూడెం మండలం అంకాలగూడెంలో ఓ మహిళ మరణించారు. పట్టణంలో పాతపేటలోను ఓ బాలిక అనారోగ్యంతో చనిపోయింది. ఆయా భౌతికకాయాలకు శ్మశన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేసిన అనంతరం, వారి బంధువులు పెద్ద సంఖ్యలో ఇక్కడ స్నానాలు ఆచరించారు.

నిత్యం ఇదే తీరు

స్నానఘట్టంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ఇక్కడికి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిత్యం ఇదే పరిస్థితి ఎదురవుతోంది. నిత్యం కొవ్వూరు శ్మశాన వాటికలో పదికి పైగా మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. అంత్యక్రియల అనంతరం బంధువులంతా గోష్పాద క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలోనే నదీ స్నానాలు ఆచరిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి స్నాన ఘట్టాలను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

గోష్పాద క్షేత్రం పవిత్రతను కాపాడాలి



పవిత్ర గోష్పాద క్షేత్రంలో స్నానాలు ఆచరించడానికి నిత్యం వందలాది మంది వస్తు ంటారు. స్నానఘట్టాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. కొద్ది రోజులుగా కనీసం పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేయడం లేదు. భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిండ ప్రదానాల రేవులో మెట్లపై ఇసుక మేటలు వేసింది. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని, ఇప్పటికైనా అధికారులు స్పందించి క్షేత్ర పవిత్రత కాపాడేలా చర్యలు తీసుకోవాలి.

– కొండపల్లి రత్నసాయి, కొవ్వూరు

పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలి



గోష్పాద క్షేత్రంలో పారిశుధ్యం మెరుగుకు పురపాలక సంఘం దృష్టి సారించాలి. స్నాన ఘట్టాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. నదిలో స్నానాలు ఆచరించడానికి నిత్యం భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. పిండ ప్రదానాల రేవు అధ్వానంగా ఉంది. అపకర్మలు నిర్వహణ అనంతరం నదిలో అస్థికలు కలిపే ప్రదేశం ప్రమాదభరితంగా ఉంది. స్నాన ఘట్టాలను తక్షణమే శుభ్రం చేయించాలి.

– పలపాల సూర్యచంద్రరావు, కొవ్వూరు

ఆర్డీవో కార్యాలయం వద్ద నేడు ధర్నా

కొవ్వూరు: కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు–సూపర్ ఫ్లాప్ నినాదంతో తాలీ బజావో పేరుతో శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కాంగ్రెస్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఎండీ షఫీ ఉల్లాబేగ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఉదయం 10.30కు చేస్తున్న ఆందోళనకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలు తక్షణమే అమలుచేయాలని కోరుతూ ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

26న దామోదర మహారాజు విరహ మహోత్సవం

కొవ్వూరు: పట్టణంలో శ్రీరామనంద గౌడీయ మఠంలో ఈ నెల 26న త్రిదండి స్వామి శ్రీమద్భక్తి సుధీర దామోదర మహారాజు తృతీయ వార్షిక విరహ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు విబుధ వామన మహారాజు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీమద్భాగవత కలశ యాత్ర, నగర సంకీర్తన, సాయంత్రం 6 గంటలకు సంధ్యా హారతి, అనంతరం అదివాస సభ నిర్వహించనున్నట్లు వివరించారు. 27 నుంచి ఫిబ్రవరి రెండో తేదీ వరకు శ్రీమద్భాగవత సప్తాహం, ఫిబ్రవరి 3న ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, విశేష పూజలు, 4న తెల్లవారుజామున మంగళహారతి, సంకీర్తనలు ఉంటాయని తెలిపారు.

క్లుప్తంగా

జాతీయ ఓటర్ల దినోత్సవంపై నేడు ర్యాలీ

కొవ్వూరు: పట్టణంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక విజయ విహార్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ఓటర్లకు అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహి స్తామన్నారు. ఇందులో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత


వేగేశ్వరపురం పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

తాళ్లపూడి: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈవో సీహెచ్ బాలామణి తెలిపారు. వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దాతల సహకారంతో శుక్రవారం అల్పాహారం ఏర్పాటుచేశారు. పూర్వ విద్యార్థి కుందుల సత్యం రూ.4 వేలు, ఉపాధ్యాయులు, సిబ్బంది మరో రూ.4 వేలతో అల్పాహారం అందజేశారు. ఎంఈవో మాట్లాడుతూ, ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు దాతల సాయంతో అల్పాహారం అందజేస్తున్నట్టు తెలిపారు.

27న మున్సిపల్ బడ్జెట్ సమావేశం

కొవ్వూరు: పురపాలక సంఘం బడ్జెట్ సమావేశం ఈ నెల 27న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. అనంతరం పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై సాధారణ సమావేశం నిర్వహిస్తామన్నారు. సభ్యులు కౌన్సిల్ సమావేశానికి విధిగా హాజరుకావాలని కోరారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి


సత్యవాడలో రోవర్‌తో చేలను సర్వే చేస్తున్న సర్వేయర్లు

ఉండ్రాజవరం: గ్రామంలో జరుగుతున్న రీ సర్వేకు రైతులందరూ సహకరించాలని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ కోరారు. ఏపీ రీసర్వే ప్రాజెక్ట్‌లో భాగంగా మండలంలోని రీ సర్వే పైలట్ గ్రామమైన సత్యవాడలో శుక్రవారం గ్రౌండ్ ట్రూతింగ్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ, సర్వేయర్లకు పలు సూచనలు చేశారు. రైతుల సమక్షంలో వారి భూమి హద్దులు చూపించిన దాని ప్రకారం, రోవర్ సాయంతో రెవెన్యూ రికార్డుల మేరకు గ్రామ సర్వే బృందం ప్రైవేట్ భూములు సర్వే చేస్తారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో జె.లక్ష్మీనరసమ్మ, మండల సర్వేయర్ శ్రీనివాసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్ల పంపిణీ


నల్లజర్లలో క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు అందిస్తున్న డాక్టర్

నల్లజర్ల: టీబీ ముక్తి భారత్ అభియాన్‌లో భాగంగా రీచ్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో పోషకాహార కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ, వ్యాధిగ్రస్తులు క్రమంతప్పకుండా మందులు వాడటంతో పాటు, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ ఆశాజ్యోతి మాట్లాడుతూ, మందులు వాడుతున్న క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.వెయ్యి వారి ఖాతాలో జమ చేస్తున్నట్టు చెప్పారు. రీచ్ ప్రాజెక్ట్ జిల్లా కో–ఆర్డినేటర్ వర్మ పాల్గొన్నారు.

కిశోర బాలికలు జాగ్రత్తలు పాటించాలి


ఐ.పంగిడి హైస్కూలులో మాట్లాడుతున్న సీహెచ్ఓ శ్రీకృష్ణుడు


ఖండవల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి కృష్ణవేణి

గోపాలపురం: కౌమార దశలో కిశోర బాలికలు తగిన జాగ్రత్తలు పాటించాలని సీడీపీఓ కె.నాగలక్ష్మి అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ పరిధిలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ నాగలక్ష్మి మాట్లాడుతూ, బాలల హక్కులు, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. కిశోర బాలికలపై తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని, ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీడీపీవో కె.పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగ వివక్ష చూపరాదు

పెరవలి: సమాజంలో బాలికలపై లింగవివక్ష చూపరాదని, ఇప్పుడు పురుషులతో పాటు స్త్రీలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని పెరవలి పీహెచ్‌సీ వైద్యాధికారి ఏ.కృష్ణవేణి అన్నారు. బాలికల దినోత్సవాన్ని కానూరు, పెరవలి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఖండవల్లి, కాకరపర్రు ఉన్నత పాఠశాలల్లో ఘనంగా నిర్వహించి, అనంతరం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆడపిల్లలకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, అనేక చట్టాలు ప్రవేశపెట్టిందని, వీటిన సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆడపిల్లలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆడపిల్లలను ప్రోత్సహిద్దాం.. వారి భవిష్యత్తును మెరుగుపరుద్దాం అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

కొవ్వూరు: నేటి బాలికలే రేపటి దేశ భవిష్యత్తుకు శక్తి స్వరూపిణిలని గౌరీపట్నం పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఏ.శ్రీకృష్ణుడు అన్నారు. ఐ.పంగిడి జెడ్పీ హైస్కూలులో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. బాలికలు యుక్త వయస్సులో మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండాలన్నారు. బాలికల ఆహార అలవాట్లు చక్కగా ఉండాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకుంటూ, వైద్యారోగ్య శాఖ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. శారీరక వ్యాయమం చేస్తూ, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

బాలికలు శక్తి స్వరూపులు

దేవరపల్లి: నేటి బాలికలే రేపటి దేశ భవిషత్తుకు శక్తి స్వరూపులని గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎ.శ్రీకృష్ణుడు అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని జెడ్పీ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో మంచి డాక్టర్లు, ఇంజినీర్లు, రాజకీయ నాయకులుగా స్థిరపడాలని ఆయన బాలికలకు సూచించారు. మానసికంగా, శారీరకంగా బాలికలు ధృడంగా ఉండాలన్నారు. బాలికలు పౌష్టికాహారం తీసుకుంటూ, వైద్యారోగ్య శాఖ వారిచ్చే ఐరన్ మాత్రలు వాడాలన్నారు. ప్రతి రోజు పాలు, గుడ్లు, తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. శారీరక వ్యాయామం చేస్తూ, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. పాఠశాల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికా విద్యతో కుటుంబ అభివృద్ధి

ఉండ్రాజవరం: బాలికలు బాగా చదువుకోవడం వలన కుటుంబం అభివృద్ధి చెందడంతో పాటు, సమగ్ర దేశాభివృద్ధికి కూడా తోడ్పడవచ్చని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.ఉషాదేవి అన్నారు. జాతీయ బాలికా దివస్ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యుక్త వయస్సుకు వచ్చిన బాలికలకు కౌమార దశలో వచ్చే శారీరక మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేయాలి

నిడదవోలు: పట్టణంలోని ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.జ్యోతి మాట్లాడుతూ, బాలికల మెరుగైన భవిష్యత్తుకు అందరూ కృషి చేయాలన్నారు. వారికి ఆసక్తి ఉండే రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. సవాళ్లను ఎదుర్కొంటూ, ముందుకు సాగుతున్న మహిళలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అధ్యాపకులు డాక్టర్ ఓ.జాస్మిన్, టి.హనుమంతరావు, డాక్టర్ పీఎస్ఎస్ స్రవంతి పాల్గొన్నారు.

పుష్కరాల నాటికి గోదావరి శుద్ధి జలాలు

- రూరల్‌లో రూ.110 కోట్లు, పట్టణంలో రూ.60 కోట్లతో ప్రతిపాదనలు
- ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు వెల్లడి


కొవ్వూరు సత్యవతినగర్‌లో పైపులైన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కొవ్వూరు: రానున్న గోదావరి పుష్కరాల నాటికి గోదావరి నీటిని శుద్ధి చేసే వాటర్‌ప్లాంట్లు అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వెల్లడించారు. పట్టణంలో రూ.60 కోట్లు, రూరల్‌కు రూ.110 కోట్లతో వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. శుక్రవారం స్థానిక సత్యవతినగర్‌లో ఏర్పాటు చేయనున్న నూతన తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.4.70 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ కాలనీలో రూ.3 లక్షల వ్యయంతో మరో పైపులైన్ నిర్మిస్తామన్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. గోదావరి తాగునీటి శుద్ధి ప్లాంట్లు పూర్తయితే, నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉండదన్నారు. నిధుల మంజూరుకు ప్రభుత్వంతో చర్చిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ, గతంలో ఈ ప్రాంతంలో ప్రజల తాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ట్యాంకర్ ద్వారా సరఫరా చేసేవారమన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, ఏఈలు కె.సుమంత్, జి.సందీప్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నల్లజర్ల: కొత్త బ్రేకరు ఏర్పాటు చేస్తున్నందున నల్లజర్ల సబ్ స్టేషన్‌లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుతున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ నారాయణం అప్పారావు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ ప్రకాశరావుపాలెం, నల్లజర్ల, జగన్నాథపురం, ఆవపాడు, నల్లజర్ల ఇండస్ట్రియల్ ఫీడర్లకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

వ్యవసాయానికి ఉదయం 6 నుంచి 9 వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 వరకు సరఫరా చేస్తామన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ


కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, డ్రైవర్లు

కొవ్వూరు: డ్రైవర్ల అప్రమత్తతతోనే ప్రమాదాల్లేని సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.విశ్వం అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం డ్రైవర్స్ డేని పురస్కరించుకుని పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కచ్చితంగా ప్రతి ఒక్క డ్రైవర్ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని, డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడరాదని ఎంవీఐ కె.శివప్రసాద్ సూచించారు. ఓవర్ టేకింగ్, అతివేగం ప్రమాదాలకు కారణమవుతాయని హెచ్చరించారు. ఎంతో మంది ప్రయాణికుల ప్రాణాలు డ్రైవర్లపైనే ఆధారపడి ఉంటాయన్నారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలని డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. థ్యాంక్యూ ఫర్ సేఫ్టీ డ్రైవింగ్ అని ఆర్టీసీ డ్రైవర్లకు పుష్పగుచ్ఛాలు, స్వీటుబాక్సులు, వాటర్ బాటిళ్లు అందజేశారు. ముఖ్యఅతిథులతో కలిసి డ్రైవర్స్ డే కేక్ కట్ చేశారు. ఆటో డ్రైవర్లు, ఆర్టీసీ డ్రైవర్లు, ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజంలో డ్రైవర్ల పాత్ర కీలకం

నల్లజర్ల: మనిషి పుట్టుక నుంచి మరణించే వరకు సమాజంలో డ్రైవర్ల పాత్ర కీలకమని ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వైఎస్ఎన్ మూర్తి అన్నారు. నల్లజర్ల జెడ్పీ హైస్కూలులో శుక్రవారం డ్రైవర్స్ డే నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆరుగురు ఉత్తమ డ్రైవర్లను సత్కరించారు. వీరిలో పి.పైడియ్య, జి.రాజాబాబు, బి.బలరాంరాజు, ఎస్ఎస్ వాసు, వైవీఎస్ గణేష్ ఉన్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మూర్తి మాట్లాడుతూ, నిత్యం వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణికులతో పాటు, విద్యార్థులను, ఉపాధ్యాయులను సురక్షితంగా చేర్చడం, ప్రమాదరహితంగా బస్సులు నడపడం ఆర్టీసీ లక్ష్యమన్నారు. హెచ్ఎం కోమలి చిత్ర పాల్గొన్నారు.

నిడదవోలు: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ డ్రైవర్స్ డే వేడుకలను నిర్వహించారు. డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, డ్రైవర్లు సమాజానికి మూల స్తంభాలన్నారు. సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు, ఆర్టీసీ యూనియన్ ప్రెసిడెంట్ రంగా రమేష్ మాట్లాడారు.

'ఉపాధి' సామాజిక తనిఖీతో జవాబుదారీతనం


సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ

నిడదవోలు రూరల్: ఉపాధిహామీ నిధులను పారదర్శకంగా వినియోగించడం, జాబ్‌కార్డు ఉన్న కూలీలకు పని కల్పించేందుకు సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నామని డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వరరావు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధిహామీ పథకం పనులపై ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా ఉపాధి కూలీలకు పని కల్పించాలన్నారు. డ్వామా పీడీ నాగమహేశ్వరరావు మాట్లాడుతూ, సామాజిక తనిఖీతో జవాబుదారీతనం పెరుగుతుందని, ఎలాంటి తప్పులు జరగడానికి అవకాశం ఉండదన్నారు. పంచాయతీ, ఉపాధిహామీ పనులకు వేర్వేరుగా రిజిస్టర్లు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని 23 గ్రామాల్లో 2023–25లో జరిగిన 1,740 ఉపాధిహామీ పనులపై తనిఖీ చేపట్టారు. రూ.8.28 కోట్లతో పనులు చేపట్టగా, ఇందులో కూలీలకు రూ.4.65 కోట్లు చెల్లించి, రూ.3.60 కోట్లు సామగ్రికి వెచ్చించారు. పంచాయతీల వారీగా తనిఖీ బృందాలు నివేదికలను చదివి వినిపించారు. మస్టర్లలో సంతకాలు లేకుండా కూలీలకు వేతనాల చెల్లింపు, డిమాండ్ లేకుండానే పనుల నిర్వహణ, జాబ్‌కార్డులు మంజూరు చేయకపోవడం వంటి లోపాలను గుర్తించారు. సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ, ఏపీఓ ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

వరి సాగులో సల్ఫైడ్ సమస్య

ఉండ్రాజవరం: తాడిపర్రు గ్రామంలో బోర్ల కింద సాగు చేసిన వరి పంటలో సల్ఫైడ్ సమస్యతో కుదుళ్లు చనిపోతున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. తాడిపర్రులో వరి చేలను ఆయన శాస్త్రవేత్త పి.నరసింహారావుతో కలసి శుక్రవారం పరిశీలించారు. దీనికి 20:20:13 కాంప్లెక్స్ ఎరువు కారణమన్నారు. దీని నివారణకు ఎకరానికి 45 కేజీల యూరియా వేసి, నీరును తీసి ఆరబెట్టాలని రైతులకు సూచించారు.

ఉచిత పశు వైద్య శిబిరం


వేములూరులో వైద్య సేవలు అందిస్తున్న డీడీ సత్యనారాయణ, ఏడీ వెంకటరెడ్డి

కొవ్వూరు: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వేములూరు గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆ శాఖ కొవ్వూరు డీడీ ఎస్.సత్యనారాయణ ప్రారంభించారు. వివిధ వ్యాధులతో ఉన్న 68 పశువులకు వైద్య సేవలు అందించినట్లు ఏడీ ఎ.వెంకటరెడ్డి తెలిపారు. 120 పెద్ద పశువులకు, 30 చిన్న పశువులకు నట్టల నివారణ మందులు అందజేశారు. 24 పాడి పశువులకు గర్భకోశ వ్యాధులు రాకుండా చికిత్స అందించారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పశు వైద్యులు జి.సోమశేఖర్, కె.చంద్రమౌళి, సహాయకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యా దినోత్సవం


నఫీజ్ దంపతులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

నల్లజర్ల: లయన్స్ క్లబ్ ఆఫ్ దూబచర్ల ఆధ్వర్యంలో స్థానిక ప్రైవేట్ స్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ అంబటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. విద్యారంగంలో ఉన్నత విలువలను చాటిచెప్పేలా మోటివేషన్ స్పీకర్ మహమ్మద్ నఫీజ్ 9, 10 తరగతుల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా నఫీజ్ దంపతులను క్లబ్ సభ్యులు సత్కరించారు.

రోడ్డుకు అడ్డుగా చెట్టు


గుండుగొలను–కొవ్వూరు ప్రధాన రహదారిలో పడి ఉన్న చెట్టు

దేవరపల్లి: గుండుగొలను–కొవ్వూరు ప్రధాన రహదారిపై దేవరపల్లి–దుద్దుకూరు గ్రామాల మధ్య ప్రమాదం పొంచి ఉంది. దేవరపల్లి సబ్‌స్టేషన్ నుంచి బందపురానికి టౌన్ ఫీడర్ లైన్ నిర్మాణం కోసం రోడ్డు పక్కనున్న చెట్లను తొలగించారు. అలా తొలగించిన ఓ చెట్టు రోడ్డుపై పడి ఉంది. దాదాపు 20 రోజులుగా చెట్టు ప్రధాన రహదారిపై అడ్డుగా ఉంది. వాహనదారులు రాత్రి సమయంలో చెట్టు కనిపించక ప్రమాదాలకు గురువుతున్నారు. అధికారులు వెంటనే ఈ చెట్టును తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.